11, 14 తేదీల్లో వెంకయ్యనాయుడు పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఈ నెల 11న భీమవరంలో పర్యటించనున్నారు. ఎస్ఆర్‌కెఆర్, విష్ణు ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్లలో జరిగే పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొనున్నారు. 14వ తేదీ మంగళవారం ఏలూరు జిల్లాలోని ఓ ప్రయివేట్ కార్యక్రమంలో ఆయన పాల్గొనున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీనికి సంబంధించిన బందోబస్తు ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు.

నిలిచిన కు.ని ఆపరేషన్లు..!

కరోనా నుంచి ప్రభుత్వాసుపత్రుల్లో ఇదే పరిస్థితి
ఏలూరు జిల్లాలో పది నెలల్లో చేసింది 20 ఆపరేషన్లే
పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఇదే పరిస్థితి
ప్రయివేటు ఆసుపత్రుల్లో ఆపరేషన్‌కు రూ.10 వేలకుపైగా వసూలు
పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను ప్రభుత్వాసుపత్రుల్లో చేయకపోవడంతో సామాన్య ప్రజానీకం పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. కరోనాకు ముందు వరకూ జిల్లా, ఏరియా, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లతోపాటు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని పిహెచ్‌సిల్లోనూ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరిగేవి. అంతేకుండా ప్రత్యేక శిబిరాలు పెట్టి మరీ కుటుంబ నియంత్రణ చికిత్సలు చేసేవారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసుకున్న వారికి నగదు, వస్తువుల రూపంలో బహుమతులు సైతం అందించేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టేసింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఎక్కడా ప్రభుత్వ పిహెచ్‌సిల్లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరగడం లేదు. ఏరియా ఆసుపత్రుల్లో చేస్తున్నట్లు చెబుతున్నప్పటికీ అవి నామమాత్రంగానే ఉంటున్నాయి. దీంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోవాలంటే ప్రయివేటు ఆసుపత్రుల్లో రూ.పది వేల నుంచి రూ.15 వేలు చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో సామాన్య ప్రజానీకం ఆర్థిక భారాన్ని తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పది నెలల్లో చేసింది 20 ఆపరేషన్లే

ఏలూరు జిల్లాలో 60 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 14 అర్బన్ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆసుపత్రి, జంగారెడ్డిగూడెం, నూజివీడులో ఏరియా ఆసుపత్రులు, కైకలూరు, చింతలపూడిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పలు ఏరియా, కమ్యూనిటీ ఆసుపత్రులు ఉన్నాయి. ఏలూరు జిల్లాలో నెలకు కనీసంగా లెక్కించినా 800 వరకూ ప్రసవాలు జరుగుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉంటుందని చెప్పొచ్చు. ఏలూరు జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జనవరి వరకూ దాదాపు 17,327 ప్రసవాలు జరిగాయి. దీనిలో 8,464 ప్రభుత్వ, 8,863 ప్రయివేటు ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగాయి. గడిచిన పది నెలల్లో ఏలూరు జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో చేసిన కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు కేవలం 20 మాత్రమే అంటే ఆశ్చర్యపోక తప్పదు. ప్రస్తుత పరిస్థితుల్లో 90 శాతానికిపైగా కుటుంబాలు ఇద్దరు పిల్లలతోనే సరిపెట్టుకుంటున్నాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను నిలిపివేయడంతో సామాన్య ప్రజానీకం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏలూరులో జిల్లా ఆసుపత్రి, రెండు ఏరియా ఆసుపత్రులు, రెండు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లతోపాటు ద్వారకాతిరుమల, కాగుపాడు, దొరమామిడి, గొల్లపల్లి పిహెచ్‌సిల్లో మాత్రమే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. 60 పిహెచ్‌సిలు ఉంటే కేవలం నాలుగింటిలో మాత్రమే జరుగుతున్నాయని తేటతెల్లమవుతోంది. ఆపరేషన్లు చేస్తున్నట్లు చెబుతున్న ఆసుపత్రుల్లోనూ సీరియస్‌గా జరగడం లేదని జరిగిన ఆపరేషన్ల సంఖ్యను బట్టి అర్థమవుతోంది. పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉన్నట్లు చెబుతున్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజానీకం కోరుతున్నారు. పిహెచ్‌సిల్లో పని చేసే వైద్యులకు ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడులో శిక్షణ ఇస్తున్నామని, త్వరలోనే అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేలా చర్యలు తీసుకుంటామని వైద్యశాఖ అధికారులు చెబుతున్నారు. కాలయాపన చేయకుండా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

పనులు అడ్డుకున్న రైతులు

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల అడ్డగింత

పరిహారం చెల్లించాలని రైతు ఆందోళన

ప్రజాశక్తి - టి.నరసాపురం

నష్ట పరిహారం చెల్లించకుండా తమ భూమిలో గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం పనులు చేపట్టవద్దని రైతు దేవరపల్లి వెంకటకృష్ణవరప్రసాద్ మంగళవారం హైవే పనులను అడ్డుకున్నారు. హైవే నిర్మాణ పనులకు అడ్డుగా రహదారిపై టెంటు వేసి తోటి రైతుల సహకారంతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు విలేకరులతో మాట్లాడుతూ టి.నరసాపురానికి చెందిన తనకు మొత్తం రెండెకరాల 40 సెంట్లు ఉండగా సర్వే నెంబర్ 66/2 బిలో ఒక ఎకరం 70 సెంట్లు, 449/2లో 30 సెంట్ల వ్యవసాయ భూమిలో గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించిందన్నారు. అయితే మిగిలిన భూమిలోనూ అదనంగా హైవే నిర్మాణ పనులను అధికారులు చేపట్టడంతో అడ్డుకున్నామని వివరించారు. ఈ విషయం తెలియగానే ఎఎస్ఐ మాధవరెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారి వి.గోపీకృష్ణ భూయజమాని వెంకటకృష్ణ వరప్రసాద్‌తో చర్చలు జరిపారు. అవసరమైన భూమిని హైవే అధికారులు రిజిస్ట్రేషన్ చేయించుకున్న తర్వాతే పనులు ప్రారంభిస్తారని వారు రైతులకు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

డ్రోన్ సర్వేను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ

రీసర్వేతో భూవివాదాలకు తెర

కైకలూరు ఎంఎల్ఎ డిఎన్ఆర్

ప్రజాశక్తి - కైకలూరు

భూయాజమాన్య నిర్ధారణకు సమగ్ర భూ రీసర్వే ద్వారా భూ వివాదాలకు తెరదించి భూయజమానులకు శాశ్వత భూహక్కు కల్పించే ఉద్దేశంతో జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష పథకాన్ని ప్రభుత్వం చేపట్టిందని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం కైకలూరులో డ్రోన్ కెమెరాలతో జరిగే భూరీసర్వే కార్యక్రమంలో భాగంగా డ్రోన్ ఎగురవేత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో సర్వే చేస్తున్నారని, దీనివల్ల రైతులకు సరిహద్దు సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ మురళీకృష్ణ, ఎంపిపి అడివి వెంకటకృష్ణమోహన్, గ్రామ సర్పంచి నవరత్న కుమారి, ఆర్ఐ ప్రసాద్, మండల సర్వేయర్ ఫణి, ఎస్ఒఐ డ్రోన్ టీం సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కిషోర్

వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు

యువత వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చేసుకోవడం ద్వారా వ్యక్తిగత అభివృద్ధికి కృషి చేయాలని నెహ్రూ యువకేంద్రం జిల్లా యూత్ అఫీసర్ డి.కిషోర్ అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఆదేశాల మేరకు నెహ్రూ యువ కేంద్రం, యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వేగవరంలోని హేలాపురి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులకు 'వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్సుపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సెట్‌వెల్ సిఇఒ ఎమ్‌డిహెచ్.మెహర్రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాసంపై కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సెట్‌వెల్ ఎఒ కెజె.కెనడీ, పర్యాటక శాఖ జిల్లా మేనేజర్ ఎస్.పట్టాభిరామన్న, జిల్లా ఉపాధి కల్పన అధికారి సి.మధుసూదనరావు, జి.ప్రవీణ్‌కృష్ణ, యూత్ ప్రొఫెషనల్ ఆఫీసర్, కళాశాల ప్రిన్సిపల్ ఎం.రాధాకృష్ణ, సివిల్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ ఎం.శ్రీనివాసరావు, కళాశాల ఎఒ కరుణానిధి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఏప్రిల్ ఐదో తేదీన చేపట్టనున్న చలో డిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు మండల గౌరవ అధ్యక్షులు తుమ్మల సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో మండలంలోని సిఐటియు, ప్రజాసంఘాల కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

11న జాతీయ లోక్ అదాలత్

36 బెంచ్ ల ఏర్పాటు

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈనెల 11వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి తెలిపారు. మంగళవారం న్యాయసేవాధికార సంస్థ భవనంలో రాజేశ్వరి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. గత లోక్ అదాలత్‌లో 9556 కేసులు రాజీ చేశామన్నారు. ప్రస్తుత లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్, సివిల్, వాహన ప్రమాద బీమా కేసులు, చెక్ బౌన్స్, కుటుంబ వివాద, మున్సిపల్ పన్నులు, చిట్‌ఫండ్, కోర్టు ముందుకు రాని బ్యాంకు లావాదేవీల కేసులు, విద్యుత్ బకాయిలు, టెలిఫోన్ బకాయిలు మొదలైనవి ప్రీలిటికేషన్ కేసులుగా రాజీ చేస్తామని తెలపారు. కక్షిదారులు తమ కోర్టు పరిధిలోని మండల న్యాయ సేవాధికార సంస్థలను, జిల్లాకేంద్రం ఏలూరులోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థను గానీ సంప్రదించవచ్చని తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 36 లోక్ అదాలత్ బెంచీలను ఏర్పాటు చేశామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కేసుల రాజీ విషయంలో సందేహాలుంటే 08812 - 224555 నెంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో 8 జగనన్న మెగా లేఅవుట్లలో

మార్చి నాటికి సబ్ స్టేషన్ల నిర్మాణం

9న ఏలూరులో వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక
ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్‌రాజు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఐదు నుండి ఏడు వేల ఇళ్ల నిర్మాణం చేపడుతున్న ఎనిమిది జగనన్న మెగా లేఅవుట్లలో మార్చి నెలాఖరు నాటికి ఎనిమిది విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తి చేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్‌రాజు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్ఆర్‌పేటలోని విద్యుత్ భవన్ సర్కిల్ ఆఫీసులో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జగనన్న హౌసింగ్ కాలనీల్లో విద్యుద్దీకరణ ప్రగతి తీరును ఆయన మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల నిర్మాణంలో భాగంగా 1145 లేఅవుట్లలో లక్షా 50 వేల ఇళ్లు మంజూరు చేసిందన్నారు. దీనిలో 305 లేఅవుట్లలో విద్యుద్దీకరణ పూర్తి చేసి ఏడు వేల ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు. మరో 40 నుంచి 50 లేఅవుట్లలో సుమారు ఆరు వేల ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు అందించేందుకు విద్యుద్దీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అదే విధంగా ఏడు వేల ఇళ్ల నిర్మాణాలకు ఏర్పాటు చేసిన ఎనిమిది పెద్ద లేఅవుట్లలో ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ఆయా ప్రాంతాల్లో ఎనిమిది మెగా విద్యుత్ సబ్ స్టేషన్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మార్చి నెలాఖరు నాటికి నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించే దిశగా పనులు వేగవంతం చేశామన్నారు. ఎపిఇపిడిసిఎల్ ఏలూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 9న గురువారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఏలూరు ఆర్ఆర్‌పేట విద్యుత్ భవన్‌లో అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల్లో సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, బిల్లులో పేరు మార్పిడి, సరఫరా పునరుద్ధరణలో ఇబ్బందులు, నియంత్రికల మార్పిడి తదితరాలపై ఫిర్యాదులను ఈ సదస్సులో వినియోగదారులు అందించవచ్చన్నారు. సమావేశంలో పలువురు విద్యుత్ శాఖాధికారులు పాల్గొన్నారు.

ఉగాదికి 26,134 ఇళ్ల నిర్మాణమే లక్ష్యం

ఇప్పటికే 61 శాతం లక్ష్యం పూర్తి
గృహనిర్మాణ సంస్థ జిల్లా అధికారి టి.వేణుగోపాల్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు ద్వారా ఉగాది నాటికి జిల్లాలో 26,134 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు గృహనిర్మాణ సంస్థ ఏలూరు జిల్లా అధికారి టి.వేణుగోపాల్ తెలిపారు. దీనిలో భాగంగా ఇప్పటికే 16,061 (61 శాతం) ఇళ్ల నిర్మాణం పూర్తవ్వగా మిగిలిన 10,073 (39 శాతం) ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు జిల్లాలోని నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, మండల ప్రత్యేకాధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, గృహ నిర్మాణ సిబ్బంది సహకారంతో నూరుశాతం లక్ష్యాలను పూర్తి చేసే దిశగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. దీనిలో భాగంగా లక్ష్యాలను పూర్తి చేసేందుకు రోజు, పక్షం వారీగా విభజించి మండల, సచివాలయస్థాయి వరకూ లక్ష్యాలను నిర్ధేశిత లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యత

మంత్రి బొత్స సత్యనారాయణ

భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యతనిచ్చి అనేక పథకాలు అమలు చేస్తున్నారని, విద్యా విధానంలో మార్పులు తీసుకొచ్చారని రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లో బి.ఫార్మసీ భవనం, మహిళా హాస్టల్ భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ అందరికీ సమాన అవకాశాలు రావాలని జాతీయ విద్యావిధానం అమలు చేస్తున్నామన్నారు. ప్రపంచస్థాయిలో విజయాలు సాధించేలా ఉన్నత విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు కంప్యూటర్ కోర్సులపైనా శిక్షణ ఇస్తున్నామన్నారు. నన్నయ యూనివర్సిటీ హాస్టల్లో వసతులు 15 రోజుల్లోగా పూర్తిస్థాయిలో సమకూర్చాలని రిజిస్ట్రార్‌కు సూచించారు. రూ.ఐదు కోట్లతో యూనివర్సిటీకి వచ్చే రోడ్డు పనులు చేపట్టాలని ఆయన సూచించారు. కళాశాలలో సమస్యలు ఏమైనా ఉంటే తనకు తెలియజేస్తే పరిష్కరిస్తానన్నారు. ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌కు రూ.150 కోట్ల విలువైన భూములను గతంలో కేటాయించినట్లు తెలిపారు. క్యాంపస్‌కు సిబ్బందిని కేటాయించాలని కోరారు. ఎం.ఫార్మసీ, ఎంకాం, ఎంసిఎ, ఎంఎస్‌సి డేటా ఎనాలసిస్ కోర్సులు ప్రవేశపెట్టాలని ఆయన విద్యాశాఖ మంత్రిని కోరారు. తాడేపల్లిగూడెంలో మహిళా ఇంజినీరింగ్ కళాశాలను కూడా మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు అందరూ బాగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జివి.ప్రసాదరాజు, జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, జాయింట్ కలెక్టర్ జెవి.మురళీ, యూనివర్సిటీ రిజిస్ట్రార్ అశోక్, ప్రిన్సిపల్ రమేష్, భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్‌లో విద్యా వికాస్ విద్యార్థుల హవా

ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో యాజమాన్యం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జెఇఇ మెయిన్స్-2023 ఫలితాల్లో స్థానిక విద్యా వికాస్ విద్యార్థులు విజయఢంకా మోగించారని కళాశాల యాజమాన్యం పి.సతీష్‌చంద్, వి.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ విడుదల చేసిన జెఇఇ మెయిన్స్ ఫేజ్-1 ఫలితాల్లో విద్యా వికాస్ కళాశాల విద్యార్థులు 25 మంది ఉత్తమ పర్సంటైల్ సాధించారని తెలిపారు. కళాశాలకు చెందిన కొల్ల జస్వంత్ ఫణి ప్రసాద్ 99.76 పర్సంటైల్స్ సాధించారని, కెజెఎస్ఎస్.అంజన 96.16, కె.జాన్ దేవదాస్ 92.3, ఎం.చంద్రమౌళి శ్రీకర్ 92.16 శాతం సాధించారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావికాస్ పాఠశాల ప్రిన్సిపల్ వి.ప్రసన్నలక్ష్మి, డైరెక్టర్ పి.లక్ష్మీప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న నాయకులు

విఎస్ఎస్‌లను రక్షించాలని ధర్నా

ప్రజాశక్తి - ఉంగుటూరు

వన సంరక్షణ సమితులను రక్షించాలని, అక్రమంగా మట్టి రవాణా నిలిపివేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పివి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఉంగుటూరు మండలం వెల్లమిల్లి గ్రామాల పరిధిలోని విఎస్ఎస్ భూముల్లో ఉన్న మట్టిని అటవీ శాఖాధికారులు, స్థానిక భూస్వాములు అక్రమంగా తవ్వేస్తున్నారని ఆరోపించారు. అక్రమాలను ప్రోత్సహిస్తున్న అటవీ శాఖాధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఒకపక్క మొక్కల పెంచాలి, అడవులను పరిరక్షించాలని కోరుతూ మరోపక్క అటవీ భూముల్లో ఉన్న మట్టిని అక్రమంగా అమ్మడాన్ని తప్పుబట్టారు. సహకరించిన స్థానిక భూస్వాములపై చర్యలు తీసుకోవాలని కోరారు. పేదలు, వ్యవసాయ కార్మికులు, దళితులు పూర్వకాలం నుండి వన సంరక్షణ సమితుల ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అటవీశాఖ భూముల్లో జామాయిల్ సాగు చేసుకుంటున్నారన్నారు. ఈ పంటను విఎస్-ఎస్‌లను విచ్ఛిన్నం చేసి నాశనం చేయడం కోసమే స్థానిక భూస్వాములు ఈ పనికి సిద్ధపడ్డారని, వెంటనే మట్టి అక్రమ రవాణా ఆపాలని డిమాండ్ చేశారు అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి కె.వెంకట్రావు మాట్లాడగా కె.అంజయ్య, పి.ప్రసాద్‌రావు, వి.రవి, డి.నాగేశ్వరరావు, వి.రామయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎం.వసంతరావు

బడ్జెట్‌లో రైతులకు ఒరిగింది శూన్యం

ప్రజాశక్తి - చింతలపూడి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతాంగ వ్యతిరేకమని, దీనివల్ల చిన్న, సన్నకార రైతులకు ఎలాంటి ప్రయోజనమూ లేదని సిపిఎం మండల కార్యదర్శి ఆర్‌విఎస్ నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.వసంతరావు అన్నారు. చింతలపూడిలో మంగళవారం సిపిఐ కార్యాలయంలో రైతు సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం ఎస్‌కె కాలేషా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రైతులకు ఒరిగింది శూన్యమన్నారు. రైతులకు మోడీ ఇచ్చిన హామీల అమలుకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. పంటలకు మద్దతు ధర కల్పనకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. రైతు సంఘం జిల్లా కన్వీనర్ రాయకుల లక్ష్మణరావు, ఎఐకెఎస్ జిల్లా అధ్యక్షులు డి.రంగనాథ్ మాట్లాడుతూ రైతుల సమస్యల పట్టని ఈ బడ్జెట్ కార్పొరేట్ కంపెనీలకు వరంగా ఉందన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి తోర్లపాటి బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బోడ వజ్రం, ఎం.లాజరు, తాడిగడప మాణిక్యాలరావు, అక్కినేని వెంకటేశ్వరరావు, ఆలపాటి రామచంద్రరావు, టి.ప్రసాద్ పాల్గొన్నారు.

రైతులను మోసగించిన బిజెపి

ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు

ప్రజాశక్తి - గణపవరం

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రైతుల పంటలకు మద్దతు ధర గ్యారంటీ చట్టానికి నిధులు కేటాయించకుండా మరోసారి మోసగించిందని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు ప్రభుత్వాన్ని కోరారు మంగళవారం పిప్పర ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన రైతు సంఘ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు ఈ సమావేశానికి కమిటీ అధ్యక్షులు మెంటే సూర్యారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ రైతుల ఆత్మహత్యలను నిరోధానికి ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రైతుల వద్ద సార్వా పంటకు చెందిన ధాన్యం రాశులు పేరుకుపోవడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం ప్రభుత్వం మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల వద్ద నుండి చివరి ధాన్యం గింజ వరకూ కొనుగోలు చేస్తామని, రైతులను ఆదుకుంటామని ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతు సంఘం జిల్లా నాయకులు గుత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో రైతులకు ధాన్యం సొమ్ముతో పాటు రవాణా ఖర్చులు కూడా ప్రభుత్వం చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో మండల నాయకులు పి.నరసింహమూర్తి, కేతా శ్రీనివాస్ ముప్పిడి సంజీవరావు, పి.బాబూరావు, సిఐటియు నాయకులు పి.గోవిందు పాల్గొన్నారు. అనంతరం ఢిల్లీలో ఏప్రిల్ ఐదో తేదీన జరిగే చలో పార్లమెంటును జయప్రదం చేయాలని సమావేశం రైతులకు పిలుపునిచ్చింది.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - గణపవరం

ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ పుష్పల శేషు అన్నారు. గణపవరం ఒకటో సచివాలయం పరిధిలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. 438 మంది విద్యార్థులకు ప్రముఖ కంటి వైద్యులు ఐ.శ్రీనివాస్ కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 34 మందికి కళ్లజోళ్లు పడతాయని గుర్తించారు. పిహెచ్‌సి వైద్యులు పి.సంతోష్‌వాయస్, పి.కిరణ్మయి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆకుకూరలు వారానికి రెండు రోజులు తినాలన్నారు. పండ్లు, ఐరన్ మాత్రలు తీసుకోవడం వల్ల రక్తహీనత ఉండదన్నారు. ప్రతీ ఒక్కరూ ఒకసారి ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.రాంబాబు, సిహెచ్‌ఒ జె.విల్సన్‌బాబు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో తెగుళ్లు దూరం

ప్రజాశక్తి - చింతలపూడి

సేంద్రియ పద్ధతుల్లో వరి పంటను సాగు చేయడం మొవ్వ పురుగు, కాండం తొలుచు పురుగు తక్కువ ఆశిస్తుందని జోనల్ అగ్రికల్చర్ పి.హస్సేన్ అన్నారు. మండలంలో పోతునూరులో మంగళవారం పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి నాట్లు వేసిన 15 నుంచి 20 రోజుల్లో ద్రవ జీవామృతం భూమికి ఇవ్వాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులకు శిక్షణ ఇచ్చారు.

దాతల సాయంతో డస్ట్‌బిన్ల పంపిణీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

గొల్లగూడెం గ్రామ సచివాలయంలో స్వచ్ఛ సంకల్పం పథకంలో భాగంగా గ్రామంలోని దాతల విరాళాలతో ప్రతీ ఇంటికి తడి, పొడి చెత్త సేకరణకు డస్ట్‌బిన్‌లు మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ ఉద్యోగి అవార్డు పొందిన డిజిటల్ అసిస్టెంట్ లక్ష్మీప్రసన్నను సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రమణరావు, పంచాయతీ విస్తరణాధికారి శంకుద్దీన్, సర్పంచ్ కరప వెంకట శ్రీనివాసరావు, డి.సత్యనారాయణ, మలకలపల్లి నాగేశ్వరరావు, ఈడల రమేష్, కొండ్రు రాము, కడారి నరసింహమూర్తి, విడియాల శ్రీను, దాసరి రాజశేఖర్ పాల్గొన్నారు.

నూజివీడులో కుష్టు నివారణ పక్షోత్సవాలు

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు పట్టణంలో జాతీయ కుష్టు నివారణ పక్షోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రి నుండి చేపట్టిన అవగాహన ర్యాలీని పిపి యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గంగాధర కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రధాన రహదారుల వెంబడి ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా గంగాధర కుమార్, లేప్రా సొసైటీ కౌన్సిలర్ ఎం.నాగరాజు మాట్లాడుతూ స్పర్శ లేని మచ్చలు కుష్టు వ్యాధి కావొచ్చన్నారు. ఎలాంటి మచ్చలున్నా ప్రభుత్వాసుపత్రుల్లో తక్షణం పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అశ్రద్ధ చేయొద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు రవికుమార్, డాక్టర్ శ్రావణి, డాక్టర్ శరీఫ్, డాక్టర్ ఎం.వి.మంగాయమ్మ, డాక్టర్ అనసూయమ్మ, డాక్టర్ నక్షత్రమ్మ, డాక్టర్ సంపూర్ణ దేవి, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - కలిదిండి

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణాజిల్లా గుడివాడ కార్మిక నగర్‌కు చెందిన షేక్ అంధాజ్(52) ద్విచక్రవాహనంపై కలిదిండి వస్తున్నాడు. పోలీస్ స్టేషన్ వద్దకు రాగానే ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంధాజ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎస్ఐ ప్రియకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిక్కిన పర్సు దొంగ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వివరాలు తెలుపుతున్న ఎస్ఐ

మహిళ పర్సును అపహరించిన వ్యక్తి ఎట్టకేలకు పోలీసులు మంగళవారం చిక్కాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ గ్రామానికి చెందిన ఎల్.అనిల్‌కుమార్ జల్సాలకు అలవాటు పడి తరచూ చోరీలకు పాల్పడుతుంటాడు. ఈ క్రమంలో సోమవారం మండలంలోని రాజవరంలో రోడ్డుపక్కన నిలుచున్న ఓ మహిళ వద్దకు వచ్చిన అనిల్‌కుమార్ చిల్లర కావాలని అడిగాడు. ఆమె చిల్లర ఇస్తుండగా పర్సును లాక్కొని పరారయ్యాడు. దీనిపై వెంటనే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు అనిల్‌కుమార్‌ను అరెస్టు చేశారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - కుక్కునూరు

వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మండలంలోని అల్లిగూడెంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గొర్ల పెరమబాబు(41) తన ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందాడు. గమనించిన తల్లి తన కుమారుడు మరణించిన విషయాన్ని బయట పెట్టకుండా ఉంచిన తన కోడలు కృష్ణవేణిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పాస్టర్ దుర్మరణం

ప్రజాశక్తి - ఉంగుటూరు

216వ జాతీయ రహదారినూ కైకరం - చేబ్రోలు మధ్య ఉన్న కల్వర్టు వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలోచర్చిపాస్టర్ దుర్మరణం పాలయ్యారు. చేబ్రోలు ఎస్ఐ స్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమడోలు మండలం అజ్జావారిగూడేనికి చెందిన పాస్టర్ మెరుగు జాన్‌రాజ్ దైవమని(48) తాడేపల్లిగూడెం నుంచి ఏలూరు వైపు బైక్‌పై వెళుతుండగా వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం కల్వర్టు వద్ద ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాట్రేనిపాడు జంట హత్యకేసు దర్యాప్తు వేగవంతం

ఆచూకీ తెలిపినవారికి బహుమతి

ప్రజాశక్తి - ముసునూరు

కాట్రేనిపాడు జంట హత్య కేసులో పరారీలో ఉన్న నిందితులను గుర్తించి సమాచారం అందించిన వారికి ప్రత్యేక బహుమతి ఇస్తామని నూజివీడు సిఐ అంకబాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాట్రేనీపాడులో జరిగిన జంటహత్యకేసులో నిందితుల కోసం నూజివీడు డివిజన్‌లో, నూజివీడు రూరల్, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాల ఎస్ఐలను ఐదు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆదేవిధంగా వారి కుటుంబ సభ్యులను సుమారు 20 మందికి పైగా విచారించామన్నారు. వారిని గుర్తించి సమాచారం అందిస్తే పారితోషికం అందిస్తామని చెప్పారు. ఈ కేసు విచారణ వేగవంతం చేశామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని చెప్పారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రాజకీయ చైతన్యం కలిగి ఉండాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

పద్మశాలి, దేవాంగ, కర్ణ భక్తులు రాజకీయ చైతన్యం కలిగి ఉండాలని దేవాంగ సంక్షేమ సంఘం నేతలు పేర్కొన్నారు. మంగళవారం ఉంగుటూరులో సంఘం ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు దొంతంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఉంగుటూరు నియోజకవర్గంలో 6500 మంది చేనేత కులస్తులున్నారని, చేనేత ఐక్యత కోసం కలిసికట్టుగా పార్టీలకు అతీతంగా మనమందరం ఐక్యమత్యంతో ఉండాలన్నారు. అందరినీ ఏకం చేసేందుకు చేనేత సభ నిమిత్తం త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో పద్మశాలి సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు వానపల్లి నాగరాజు, ఎంపిటిసి సభ్యులు బండారు నాగరాజు పాల్గొన్నారు.

ఆలయ పాలక మండలిలో ఇద్దరికి స్థానం

ప్రజాశక్తి - దెందులూరు

మండలానికి చెందిన ఇరువురికి వివిధ దేవస్థానాల్లో పాలక మండలి సభ్యులుగా అవకాశం లభించింది. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. దెందులూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచి టి.వేదకుమారికి విజయవాడలో ప్రసిద్ధి చెందిన కనకదుర్గ ఆలయ పాలక మండలి సభ్యురాలిగా ఎంపిక చేసినట్లు తెలిపారు. అదేవిధంగా వేగివాడ మాజీ ఎంపిటిసి సభ్యులు ముస్సే శ్రీనుకు ద్వారకాతిరుమల వెంకటేశ్వరస్వామి దేవస్థానం పాలక మండలి సభ్యులుగా ఎన్నికైనట్లు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ సందర్భంగా వారు ఏలూరు పార్లమెంటు సభ్యులు కోటగిరి శ్రీధర్, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు.

వాలంటీర్ల నియామకం పూర్తి

ప్రజాశక్తి - దెందులూరు/పెదవేగి

దెందులూరు, పెదవేగి మండలాల్లో ఖాళీగా ఉన్న వాలంటీర్ల పోస్టులను మంగళవారం భర్తీ చేశారు. ఆయా ఎంపిడిఒలు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశారు. పెదవేగి మండలంలో 11 వాలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా 10 మంది హాజరయ్యారని ఎంపిడిఒ రాజ్ మనోజ్ తెలిపారు. దెందులూరు మండలంలో 10 వాలంటీర్ పోస్టులకు ఎంపిడిఒ ఎపిబివి.లక్ష్మి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 15 మంది హాజరయ్యారని ఆమె తెలిపారు.

అభ్యుదయవాది బత్తుల వీరమ్మ మృతి

ప్రజాశక్తి - నూజివీడు



వీరమ్మ (ఫైల్‌ఫొటో)

అభ్యుదయవాది, అంబేద్కరిస్ట్ బత్తుల వీరమ్మ(85) వయోభారంతో మంగళవారం తెల్లవారు జామున మృతిచెందారు. అభ్యుదయ వాదిగా, ప్రముఖ సామాజికవేత్తగా నిత్యం పలుసేవా కార్యక్రమాలు చేసే ఆమె మృతి పలువురిని కలచివేసింది. ఎంతో చలాకీగా అనేక కార్యక్రమాల్లో ఆమె పాల్గొనేది. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలను తమ ఇంటి పండుగగా నిర్వహిస్తూ, ప్రతి ఇంటా వెలుగులు విరజిమ్మాలని ఆశించిన మానవతావాది ఆమె. కుల, మత, వర్గ విభేదాలకు తావు లేకుండా అందరికీ ఆత్మీయురాలిగా ఉంటూ వేలాదిమంది విద్యార్థులను చదివించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు. ఆమె కళ్లను దానం చేయడం ద్వారా ఇరువురి అంధులకు వెలుగులు అందించారు. ఆమె మృతికి పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముద్రబోయిన వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు, తెలుగు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, టిడిపి నూజివీడు పట్టణ అధ్యక్షులు మలిశెట్టి జగదీష్, ముసునూరు రాజా, టిడిపి సీనియర్ నేతలు సత్యనారాయణ (నాని), పాదం సత్యనారాయణ, గన్నవరం జెడ్‌పిటిసి సభ్యులు ఎలిజబెత్ రాణి, దళిత బహుజన పరిరక్షణ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు అన్నవరపు నాగేశ్వరరావు నివాళులర్పించారు.

ఫ్యూచర్ ఇండియా టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఫ్యూచర్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో స్నేహాంజలి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్ -10 ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో మంగళవారం ప్రారంభమైంది. తొమ్మిదేళ్లుగా ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారని ఈ సంవత్సరం సీజన్ - 10 ఫ్యూచర్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో ప్రారంభమయ్యాయని ఉమ్మడి జిల్లా ఎన్‌జిఒ ప్రెసిడెంట్ చోడగిరి శ్రీనివాస్ అన్నారు. యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఒకటో పట్టణ సిఐ బోనం ఆదిప్రసాద్, ఇరిగేషన్ జెఇ పంజా కిషోర్, సిఇఒ బ్రిడ్జ్ రాక్ వెబ్ సొల్యూషన్స్ రియాజ్ అలీ ఖాన్, రాజేష్, అగ్గాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సైరాభాను సేవాదృక్పథం అభినందనీయం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పుట్టిన రోజును పురస్కరించుకొని హీల్ ప్యారడైజ్‌లోని విద్యార్థులకు నూతనవస్త్రాలను అందజేయడం అభినందనీయమని ప్రిన్సిపల్ ధవళ సుశీల అన్నారు. మంగళవారం విజయవాడకు చెందిన ప్రముఖ వైద్యురాలు ఎస్‌కె.సైరాభాను తన పుట్టినరోజు సందర్భంగా హీల్ విద్యార్థులు 15 మందికి నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హీల్ సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్ పి.రవి, వరకుమార్, అబ్రహం, శిరీష, జయ పాల్గొన్నారు.

ఘనంగా అంకమ్మ దేవర ఉత్సవాలు

ప్రజాశక్తి - నూజివీడు

రావిచర్ల గ్రామంలోని బెజవాడ వారి ఇలవేల్పు శ్రీఅంకమ్మ దేవరతల్లి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఉప్పాల హారికా రాము, ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తనయులు యువనేత వెంకట వేణుగోపాల అప్పారావు (చంటి నాయన) ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూజివీడు మాజీ సమితి ప్రెసిడెంట్ కీర్తిశేషులు చెరుకూరి కుటుంబరావు, పుష్పావతమ్మ దంపతులు అమ్మవారి ఆలయ నిర్మాణం, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఎంతో విలువైన స్థలాన్ని వితరణగా అందించటం అభినందనీయమన్నారు.

పంటలు నాశనమవుతున్నా పట్టదా..!

తహశీల్దార్ తీరుపై రైతుల ఆగ్రహం - నిబంధనలకు విరుద్ధంగా చెరువులు తవ్వుతున్నా స్పందించడం లేదని అసహనం

ప్రజాశక్తి - మండవల్లి

చెరువు తవ్వకాలను పరిశీలిస్తున్న తహశీల్దార్

పచ్చని పొలాలను చెరువులుగా మార్చి సరిహద్దు పంటలను నాశనం చేస్తుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని తహశీల్దార్ జనార్ధన్‌రావును రైతులు నిలదీశారు. 'గత మూడు నెలల నుండి పొలాలను కనుమరుగు చేస్తూ మట్టిని తరలించేస్తుంటే మీకు కనబడడం లేదా' అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన లింగాలలో మంగళవారం చోటు చేసుకుంది. 'పొలాలను తవ్వేస్తున్నారు' శీర్షికతో ఇటీవల ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లా ఉన్నతాధికారులు తహల్దార్‌ను హెచ్చరించినట్లు సమాచారం. ఈ క్రమంలో ఆయన చెరువులుగా మార్చేస్తున్న పంటలను మంగళవారం పరిశీలించారు. ఈ క్రమంలో రైతులు తహశీల్దార్ వద్దకు చేరుకుని ఆయన్ను నిలదీశారు. పొలాలను చెరువులుగా మార్చేస్తూ తోటి సరిహద్దు రైతుల నోట్లో మట్టి కొడుతున్నప్పటికీ ఎందుకు పట్టించుకోవడం లేదని గట్టిగా నిలదీశారు. ఈ ప్రాంతంలో వరి పంటకు ఎలాంటి ఇబ్బందులూ లేవని వరి పంట లాభసాటిగానే ఉందని, చెరువు తవ్వకం వల్ల తమ పొలాలు పాడవుతాయని ప్రాధేయపడినప్పటికీ ఎందుకు పట్టించుకోలేదని రైతులు ప్రశ్నించారు. రెండు నెలలుగా రాత్రీపగలు తేడా లేకుండా చెరువులను తవ్వేస్తూ మట్టిని తరలించేస్తుంటే పట్టించుకోకుండా ఇప్పుడు ఎందుకు వచ్చారంటూ నిలదీశారు. మట్టి కావాల్సిన వారు ఇచ్చే కాసులకు లోబడి పొలాలను నాశనం చేస్తారా అంటూ ఆయనపై ధ్వజమెత్తారు. గుత్తేదారుడు చెరువులను తవ్వి మట్టిని తరలించి తీరుతామంటూ రైతులపై దౌర్జన్యానికి దిగి బండ బూతులు తిడుతున్నాడని, పొలాలను నాశనం చేయడమే కాకుండా సరిహద్దు రైతులను బూతులు తిట్టడం ఎంతవరకు సమంజసమని తహశీల్దార్‌ను ప్రశ్నించారు. అనంతరం తహశీల్దార్ రైతులకు సరైన సమాధానం చెప్పకుండానే అక్కడ నుంచి వెళ్లిపోయారు.

ఇదిలా ఉంటే తహశీల్దార్ వస్తున్నారనే సమాచారం తెలుసుకున్న గుత్తేదారుడు పొక్లెయిన్లను, టిప్పర్లను అక్కడ నుంచి తీసుకెళ్లిపోయాడు. చెరువులను పరిశీలించిన తహశీల్దార్ పక్కనే ఉన్న పొక్లెయిన్లను పట్టించుకోకపోవడం, రైతులు చెప్పేది వినకపోవడం విస్మయానికి గురిచేసింది. చెరువు తవ్వకోవడానికి తహశీల్దార్ ఏ విధంగా సహకరిస్తున్నారనేది పూర్తిస్థాయిలో తేటతెల్లమైందని రైతులు అంటున్నారు. పొలాలను చెరువులుగా మార్చి మట్టిని తరలిస్తున్నా పట్టించుకోకపోవడం గుత్తేదారుడికి, తహశీల్దార్‌కు మధ్య లావాదేవీలు ఏ స్థాయిలో ఉన్నాయనేది తెలుస్తుందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించి చెరువు తవ్వకాలను, మట్టి తరలింపును అడ్డుకోవాలని, దీనికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకుని సరిహద్దు పొలాలను, రైతులను కాపాడాలని కోరుతున్నారు. దీనిపై తహశీల్దార్‌ను ప్రశ్నించగా చెరువు తవ్వకాలను పరిశీలించి నిలుపుదల చేశామని చెప్పారు. కొత్తగా చెరువులు తవ్వకోవడానికి అనుమతులు ఇవ్వడం లేదన్నారు. అనుమతులుంటేనే చెరువులు తవ్వకోవాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇళ్ల లబ్ధిదారులకు రుణం రూ.ఐదు లక్షలు ఇవ్వాలి

ప్రజాశక్తి - నిడమర్రు

జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు రూ.ఐదు లక్షల రుణం ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి నారపల్లి రమణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో జి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన పార్టీ ముఖ్యనేతల సమావేశంలో రమణరావు మాట్లాడారు. సిఎం జగన్ పాదయాత్ర సమయంలో తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వమే పేదల ఇళ్లను నిర్మించి ఇస్తుందని మాటీ ఇచ్చారని, కానీ నేడు పూర్తిగా విస్మరించారన్నారు. ఈ సమావేశంలో కోన శ్రీనివాసరావు, కె.వరప్రసాద్, వెలగలేటి మోహన్, లావేటి చంద్రరావు మాట్లాడారు.

కాటన్ కార్పొరేషన్ మూసివేత నిర్ణయం దుర్మార్గం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మూసివేతకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం దారుణమని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. మంగళవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఎపి రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగంపై కక్షకట్టినట్లుగా వ్యవహరిస్తోందన్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ)ని మూసివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని మండిపడ్డారు. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా, రైతులకు వ్యతిరేకంగా ఉన్న కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ ఈనెల తొమ్మిదో తేదీన దేశవ్యాప్తంగా పాటించాలని కోరారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌కు సమర్పించిన బడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాలకు భారీ ఎత్తున నిధులు తగ్గించారన్నారు. ఒకవైపు దేశవ్యాప్తంగా రైతులు, రైతు సంఘాలు మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని, రైతులు పండించిన అన్ని పంటలను ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు అవసరమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరతుండగా, దానికి పూర్తి భిన్నంగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ)కు కేవలం లక్ష రూపాయలు మాత్రమే కేటాయించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు సిరిబత్తుల సీతారామయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పిటిసి సభ్యులు లీలానవకాంతం

అధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

వాడీవేడిగా దెందులూరు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - దెందులూరు

'అధికారులు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే సందర్భంలో స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదు. కనీసం ప్రోటోకాల్ కూడా పాటించడం లేదు' అంటూ మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపిపి బి.సుమలత అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల పరిషత్ సమావేశ వాడీవేడిగా సాగింది. వివిధ శాఖల అధికారుల తీరుపట్ల ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రోటోకాల్ పాటించడం లేదని ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. జెడ్‌పిటిసి సభ్యులు లీలా నవకాంతం మాట్లాడుతూ మండలంలో అన్ని శాఖల అధికారులు ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టినప్పుడు విధిగా ప్రజా ప్రతినిధులకు తెలపాలన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలో ఏడు ట్రాక్టర్లు పంపిణీ చేశారని, ఎంఎల్ఎ, జెడ్‌పిటిసి, ఎంపిపికి కనీసం సమాచారం ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి వెళ్లాలంటే ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఎంపిపి మాట్లాడుతూ గత కొంతకాలంగా విద్యుత్ శాఖ అధికారులుగానీ, సిబ్బంది గానీ సమావేశాలకు గైర్హాజరు కావడం పట్ల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎపిబివి.లక్ష్మీ, తహశీల్దార్ ఎన్‌వి.నాంచారయ్య, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విశ్వనాథ్ మృతి తీరనిలోటు

ప్రజాశక్తి - ఏలూరు

సంతాప సభలో నేతలు

కళాతపస్వి కె.విశ్వనాథ్ మృతి సినీ, కళారంగానికి తీరని లోటు అని పలువురు వక్తలు అన్నారు. స్థానిక వైఎంహెచ్ఎ హాలులో కళాతపస్వి, పద్మశ్రీ కె.విశ్వనాథ్ సంతాపసభను వివిధ కళాసంఘాల ప్రతినిధుల నిర్వహించారు. వివిధ కళాసంస్థల ప్రతినిధులు, వివిధ రంగాల కళాకారులు పాల్గొని విశ్వనాథ్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంబికాకృష్ణ, మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కెవి.సత్యనారాయణ, సెక్రటరీ వేమా కోటేశ్వరరావు, కోశాధికారి కానాల రమేష్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సెక్రటరీ మజ్జి కాంతారావు, జాయింట్ సెక్రటరీ కెబి.రావు, ఎల్.వెంకటేశ్వరావు, కోశాధికారి గాధంశెట్టి శ్రీనివాస్, ఉభయ కమిటీల సభ్యులు దువ్వి హేమసుందర్, అలిమిల్లి రంగవరప్రసాద్, ఎం.సూర్యనారాయణ యాదవ్, డాక్టర్ గుడిపాటి లలిత, పార్వతి రామచంద్రన్, వివిధ సంఘాల నాయకులు దువ్వి రామారావు, శ్రీహరికోటి, శర్మ, గురు శర్మ, సూర్య ప్రకాష్, యజ్ఞప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

సైకిళ్లు అందజేస్తున్న తాతాజీ

స్థానిక నాలుగో వార్డులో విద్యార్థినులకు దాతల సహకారంతో రెండు సైకిళ్లు అందించామని వారధి ట్రస్ట్ వ్యవస్థాపకులు వలవల తాతాజీ తెలిపారు. మంగళవారం భావరాజు కృష్ణమోహన్, గాయత్రి దంపతుల వితరణతో రెండు సైకిళ్లు ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిలు గెల్లా హర్షిత, సాకూరి మధుశ్రీలక్ష్మికి అందించారు. ఈ సందర్భంగా వలవల తాతాజీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థినిలకు 18 సైకిళ్లు అందించాలనే సంకల్పంలో భాగంగ ఇప్పటి వరకు 15 సైకిళ్లు అందించామని తెలిపారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు(అంజి) మాట్లాడుతూ వారధి ట్రస్ట్ చేస్తున్న సమాజహిత సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తాయని, వలవల తాతాజీ కృషి అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త కెఎల్‌ఎన్.ధనకుమార్, ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనాగేశ్వరకుమార్, మద్దిపాటి శ్రీను, కొత్తపల్లి శివ, ముత్తంశెట్టి సర్వేశ్వరరావు, బసవరాజు వేణు, పెదవేగి రాంబాబు, కంబాల పండు పాల్గొన్నారు.

చిన్నవెంకన్న ఆలయ ట్రస్ట్‌బోర్డ్ సభ్యులుగా రామకృష్ణారావు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ ధర్మకర్తల మండలి సభ్యునిగా జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన వాసా రామకృష్ణారావు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం జిఒ 113 జారీ అయింది. జంగారెడ్డిగూడెం పట్టణంలో పలు ప్రభుత్వ సంస్థలకు స్థల దానం చేసిన వాసా చిన్నఅయ్యన్న కుమారుడు రామకృష్ణారావు వైసిపి ఆవిర్భావం నాటి నుండి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఆయన భార్య వాసా లక్ష్మి జంగారెడ్డిగూడెం పంచాయతీ వార్డు సభ్యునిగా సేవలందించారు. రామకృష్ణారావు నియామకం పట్ల వైసిపి నాయకులు మేడవరపు విద్యాసాగర్, కర్రా భాస్కర్, చిటికెల అచ్యుతరామయ్య, ఎల్.వెంకటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఎం జగన్, ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, చింతలపూడి ఎమ్మెల్యే ఎలిజాకు రామకృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు.

బేస్‌బాల్ పోటీల్లో చింతలగూడెం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మంగయ్యపాలెం పంచాయతీ చింతలగూడేనికి చెందిన ఎం.మహేష్, కె.రాజా బేస్‌బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. సిఎస్‌టిఎస్ డిగ్రీ కళాశాలలో చదువుతున వీరు కాకినాడ పిఆర్ కళాశాలలో జరిగిన అంతర్ కళాశాల బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి అఖిలభారత విశ్వవిద్యాలయ జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా క్రీడాలను సర్పంచి అభినందించి రూ.ఐదు వేలు అందించారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 14 నుంచి 18 వరకూ అస్సాం రాయల్ గ్లోబల్ యూనివర్సిటీలో జరిగే పోటీల్లో పాల్గొనున్నారు.

ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - కైకలూరు

అమ్మవారి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం కొల్లేటికోట శ్రీపెద్దింటి అమ్మవారి వార్షిక జాతర, మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గోకర్ణేశ్వర స్వామి ఆలయ ఉత్సవాల గోడపత్రికలను ఎంఎల్ఎ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ కందుల వేణుగోపాలరావు, గోకర్ణేశ్వరస్వామి వారి దేవస్థాన పాలక మండలి ఛైర్మన్ చింతా సాయిబాబు, దేవస్థానాల ప్రధాన అర్చకులు పేటేటి పరమేశ్వరరావు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ సర్టిఫికెట్ (EC) పోయినది

TENNETI VIJAYA LAKSHMI అను నాకు KUWAIT రాయబార కార్యాలయం అధికారులు ది. 15-09-2020న **X0904500** నెంబరు గల ఎమర్జెన్సీ సర్టిఫికెట్ (EC) మంజూరు చేసారు. సదరు EC తీసుకొని నరసాపురం పట్టణంలోని మా బంధువుల ఇంటికి వచ్చిన సందర్భంలో మెయిన్‌రోడ్డు వద్ద నా ఒరిజినల్ EC పోయినది. గాన, నా ఎమర్జెన్సీ సర్టిఫికెట్ (EC) ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

TENNETI VIJAYA LAKSHMI
D/o. T.VIJAYA RATNAM, D.No.4-97
Poolapalli, Palakol Mandal,
West Godavari Dist., A.P.

డాక్యుమెంట్ పోయినది

కూకట్‌పల్లి, హైదరాబాదు కాపురస్తులు పి.నిఖిల్ వర్మ, తండ్రి: పి.శ్రీనివాసరాజు అను నాకు చెందిన ది.05-11-2007 సం॥రం తేదీన గునుపూడి (భీమవరం) సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో రిజిష్టర్డు కాబడిన **డాక్యుమెంట్ నెం. 181/2007 & 182/2007** రు గల ఒరిజినల్ లింకు దస్తావేజులు కవరులో పెట్టుకుని ది. 16-01-2023న నా ఫ్లాటు నం. F 103, H.No. 9-1-2/2, వెంకటేశ్వర నగర్, వార్డు నం. 19, భీమవరం నుండి ఎలక్ట్రికల్ సబ్ స్టేషనుకు (బస్సు డిపో దగ్గర గల) పోవుచున్నప్పుడు మార్గ మధ్యలో పడిపోయినవి. దొరికినవారు ఈక్రింది వారికి అందజేయ వలసినదిగా కోరుచున్నాను.

పి.నిఖిల్ వర్మ, సెల్: 9441258811